క్లుప్తంగా

చర్చి నిర్మాణానికి శంకుస్థాపన



చర్చి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, జెడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ

పెదపాడు : ప్రతి ఒక్కరూ దైవచింతన కలిగి ఉండాలని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. కొత్తముప్పర్రు గ్రామంలో పునీత జోషఫ్ నూతన చర్చి నిర్మాణానికి గురువారం జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీతో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. చర్చి నిర్మాణం త్వరితగతిన పూర్తికావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో దెందులూరు ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి అల్ల సతీష్ చౌదరి, పెదపాడు సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రూ.కోటి వ్యయంతో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



కలపర్రులో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసిన అధికారులు

పెదపాడు : కలపర్రు సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ట్రాన్స్‌ఫార్మర్స్ నారాయణ అప్పారావు తెలిపారు. దీనిలో భాగంగా రూ. కోటి వ్యయంతో ఏర్పాటు చేసిన 5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రఘు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఏలూరు త్రివాస్, పెదపాడు ఏఈ వైరాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వట్లూరు పంచాయతీని సందర్శించిన ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్



వట్లూరు గ్రామపంచాయతీని సందర్శించిన ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పూజ

పెదపాడు : మండలంలోని వట్లూరు గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని గురువారం ట్రైనీ అసిస్టెంట్ కలెక్టరు పూజ సందర్శించారు. పంచాయతీలో నిర్వహించే విధులు, కార్యకలాపాలు తెలుసుకుని అనంతరం రికార్డులను పరిశీలించారు. శిక్షణలో భాగంగా పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించినట్లు ఆమె చెప్పారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి మేకా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సమాధుల పండుగ



సమాధుల వద్ద కుటుంబ సభ్యులు, బంధువులు ప్రార్థనలు నిర్వహిస్తున్న దృశ్యం

దెందులూరు: చనిపోయినవారిని జ్ఞాపకం చేసుకోవడం ఆశీర్వాదకరమని దెందులూరు ఆర్‌సీఎం చర్చి ఫాదర్ అమ్మన్‌రాజా అన్నారు. గురువారం సమాధుల పండుగను గ్రామంలో అన్ని ఆర్‌సీఎం సమాధుల తోటల్లో నిర్వహించారు. చర్చిల్లో ప్రార్థనలుచేసి సమాధులను వివిధ పుష్పాలతో అలంకరించి మృతులకు వారి కు టుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు నివా ళులర్పించారు. ఆర్‌సీఎం హెచ్‌ఎం పీజే కెనడీ, గ్రామస్తులు, సంఘస్తులు, సిస్టర్లు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు అందజేత



రూ.70 వేలు సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు: ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం అని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. ఇటీవల మోకాలు శస్త్రచికిత్స చేయించుకున్న నాయుడుగూడెం గ్రామానికి చెందిన కట్నేని తులసీరామ్‌కు వైద్యసహాయం నిమిత్తం ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి సీఎంఓ కార్యాలయ అధికారులతో మాట్లాడి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు మంజూరు చేయించారు. సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన రూ.70 వేల చెక్కును బాధితుడు తులసీరామ్‌కు గురువారం జెడ్పీ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కష్టాల్లో ఉన్నవారిని ఆదుకునేందుకు వైఎస్సార్ సీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు.

బడుగు, బలహీన వర్గాలకు న్యాయం

ఎమ్మెల్యే వాసుబాబు



గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వృద్ధురాలికి సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

ఉంగుటూరు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక బడుగు, బలహీన వర్గాలకు న్యాయం జరిగిందని ఉంగుటూరు శాసన సభ్యుడు పుప్పాల వాసుబాబు అన్నారు. గురువారం ఉంగుటూరు సచివాలయం-2 పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వాసు బాబు ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చాక ఇంత పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలను పేదలకు అందించిన ప్రభుత్వం తమదేనని పేర్కొన్నారు. అవినీతికి తావు లేకుండా సంక్షేమ పథకాల లబ్ధిని నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోనే వేస్తున్నామన్నారు. గత ప్రభుత్వాలకు భిన్నంగా ఎలాంటి సిఫార్సులు లేకుండా అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు కొరిపల్లి జయలక్ష్మి శ్రీనివాసు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మరడ మంగరావు, సచివాలయాల మండల కన్వీనర్ పెనుగొండ బాలకృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు సందక రాంబాబు, వైఎస్సార్ సీపీ పంచాయతీరాజ్ అధ్యక్షుడు పుప్పాల గోపి, వైఎస్సార్ సీపీ వీవర్స్ జిల్లా అధ్యక్షులు దొంతంశెట్టి సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యవర్గ సభ్యురాలు మంద జయలక్ష్మి, నాయకులు దూసనపూడి లక్ష్మీనారాయణ, కొల్లినాగు, శ్రీరెడ్డి శ్రీనివాసు, మారిశెట్టి సత్యనారాయణ, కాళ్ల శివాజీ, లచ్చిరెడ్డి త్రిమూర్తులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ రంగంలో మంచి ఉపాధి అవకాశాలు



యువతకు అవగాహన కల్పిస్తున్న డైరెక్టర్ గంగిరెడ్డి శ్రీకాంత్

భీమడోలు: నేటి యువతకు సాఫ్ట్‌వేర్ రంగంలో ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని హైదరాబాద్‌కు చెందిన కెరీర్ బ్రిడ్జి ఐటీ సర్వీసెస్, ఓవర్సీస్ ఎడ్యుకేషన్ డైరెక్టర్లు గంగిరెడ్డి కృష్ణ హేమంత్, గంగిరెడ్డి శ్రీకాంత్‌లు అన్నారు. పూళ్ల పంచాయతీ శివారు ఎంఎంపురం గ్రామానికి చెందిన వట్టి వీరవెంకట సత్యనారాయణ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మండల అధ్యక్షుడు వట్టి సుగుణాకర్ ఆధ్వర్యంలో గురువారం భీమడోలు శ్రీ వెంకటేశ్వర జూనియర్, డిగ్రీ కళాశాలల యువతీ యువకులకు కెరీర్ గైడెన్స్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ప్రిన్సిపాల్ బొమ్మ రవికుమార్ అధ్యక్షత వహించారు. డైరెక్టర్లు గంగిరెడ్డి కృష్ణ హేమంత్, గంగిరెడ్డి శ్రీకాంత్‌లు మాట్లాడుతూ నేటి యువత కంప్యూటర్ రంగంపై ఆసక్తిని పెంచుకోవాలని సూచించారు. అనంతరం ఇంటర్ చదువుకుంటున్న పోతుల జ్యోతి సుప్రియకు ఆర్థిక సాయం చేశారు. అలాగే భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఇన్‌పేషెంట్లు, అవుట్ పేషెంట్లకు పౌష్టికాహార కిట్లను అందించారు. కార్యక్రమంలో మానవత జిల్లా ప్రతినిధులు వట్టి పవన్‌కుమార్, అప్పక రాంబాబు, పంచకర్ల సత్యనారాయణ, తుమ్మల ఉమామహేశ్వరరావు, మాజీ అధ్యక్షుడు పచ్చా వెంకటేశ్వరరావు, ఆసుపత్రి సూపరింటెండెంట్ సునీత పాల్గొన్నారు.

నేడు సీతంపేటలో గడపగడపకు మన ప్రభుత్వం

దెందులూరు: సీతంపేట గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 9.30 గంటల వరకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని తెలిపారు. సర్పంచ్ పరసా లక్ష్మి సుజాత కనకరాజు, సొసైటీ చైర్మన్ నల్లూరి వెంకట్రామయ్య (బాబి), పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కోటిపల్లి సురేష్, ఎంపీటీసీల పులవర్తి సంతోష్, పులవర్తి వరమణి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

పాఠశాలకు దాతృత్వం



కొవ్వలి ఉన్నత పాఠశాలకు ఉపకరణాలు సమకూర్చిన దృశ్యం

దెందులూరు: కొవ్వలిలో ఆకుల రామకృష్ణ జ్ఞాపకార్థం ఆయన మనవడు లింగం యశ్వంత్ సుమారు రూ.లక్షతో పాఠశాలలో వసతులు కల్పించారు. రూ.75 వేల విలువ కలిగిన 70 నీల్‌కమల్ చైర్స్, రూ. 18,500లతో యాంపిల్‌ఫైర్, రూ.17,,500లతో ప్రింటర్‌ను పాఠశాలకు అందించారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధికి కృషి చేసిన దాత యశ్వంత్‌ను హెచ్‌ఎం ఎస్‌ఎల్‌ఎన్‌వీజీ శర్మ, ఉమామహేశ్వరరావు, లింగం శ్రీనివాసరావు నాగశ్రీ, గ్రామస్తులు, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

ఆసుపత్రిలో పింఛన్ అందజేత



స్వర్ణకుమారికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ సురేష్

దెందులూరు: కొవ్వలి గ్రామానికి చెందిన పింఛన్ లబ్ధిదారు మంచిరెడ్డి స్వర్ణకుమారికి ఇటీవల కాలు విరిగింది. ఏలూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆమెకు గురువారం కొవ్వలి గ్రామ సచివాలయం-2 వలంటీర్ గొరిపర్తి సురేష్ రూ.2750 పింఛన్ నగదును ఆసుపత్రికి వెళ్లి అందచేశారు. ఈ సందర్భంగా వలంటీర్‌ను సర్పంచ్ ఇంటేటి మధులత, ఏఎంసీ వైస్ చైర్మన్ కాటి సుధాకర్, వైస్ ఎంపీపీ గొల్ల నాగరాజు, సొసైటీ చైర్మన్ కొమ్మిన రాము, ఎంపీటీసీలు గొరిపర్తి వరలక్ష్మి రంగారావు అభినందించారు.

బీసీ సాధికార సాధనకు కృషి



ఎంపీ కోటగిరి శ్రీధర్‌ను కలిసిన బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గంటా ప్రసాద్

దెందులూరు: బీసీ సాధికార సాధనకు తన వంతు కృషిచేస్తానని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ అన్నారు. గురువారం బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గంటా ప్రసాద్ ఎంపీ కార్యాలయంలో ఎంపీ శ్రీధర్‌ను కలిశారు. ఉమ్మడి, కోస్తా జిల్లాల్లో బీసీల అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న చేయూతతోపాటు కేంద్ర ప్రభుత్వం నుంచి సహకారం అందించే విధంగా కృషి చేయాలని ఘంటా ప్రసాద్ ఎంపీ శ్రీధర్‌ను కోరారు. దీనిపై ఆయన స్పందిస్తూ బీసీల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఎంపీని కలిసిన వారిలో ముసునూరు జడ్పీటీసీ డాక్టర్ ప్రతాప్, బీసీ నాయకులు ఉన్నారు.

దోమల నివారణకు చర్యలు

పెదపాడు: పెదపాడు గ్రామంలో దోమల నివారణకు చర్యలు చేపట్టారు. గురువారం గ్రామంలోని ఆరోగ్య సిబ్బంది గ్రామ పంచాయతీ పరిధిలోని యాదవుల పేట, తెలగాలపేట ప్రాంతాల్లో దోమల మందు పిచికారి చేశారు. డెంగీ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు దోమల నివారణకు టేమోపాస్ మందును పిచికారి చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది రమేష్, ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామిక పోరాటానికి సిద్ధం కావాలి



ఏఎంసీ వద్ద అమరవీరులకు నివాళులర్పిస్తున్న హమాలీలు

ఏలూరు రూరల్: నూతన ప్రజాస్వామిక విప్లవ పోరాటానికి ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండాలని న్యూడెమోక్రసీ ఏలూరు నగర కార్యదర్శి బద్దా వెంకటరావు పిలుపునిచ్చారు. గురువారం ఏలూరు మార్కెట్‌యార్డ్ వద్ద సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు విప్లవ ఉద్యమం అమర వీరుల సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. వెంకటరావు మాట్లాడుతూ దేశంలో పీడిత ప్రజల హక్కుల కోసం ఎందరో విప్లవ వీరులు అలుపెరగని పోరాటం చేశారని గుర్తు చేశారు. మరో నాయకుడు వెంకట్రావ్ మాట్లాడుతూ ఉద్యమాల ద్వారా పోరాటం చేయనిదే సమస్యలు పరిష్కారం కావని అన్నారు. కేంద్ర ప్రభుత్వం విధానాలకు వ్యతిరేఖంగా ప్రజాస్వామ్యవాదులు కలిసి కట్టుగా పోరాడాలని కోరారు. తొలుత ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో అమరులైన ధర్మన్న, పాదం రామకృష్ణ, సంద్యాల సుబ్బారావు, శీలబోయిన రాఘవులు, రవన్న, అరుణోదయ రామారావులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో మంగరాజు రాము, జి.రమణ, పల్లి గంగరాజు, విజయ్, అప్పారావు, రమణ, బండి నాగేశ్వరరావు, కొరాడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షతో పేదలకు మెరుగైన వైద్యసేవలు



జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లు అందచేస్తున్న దృశ్యం

దెందులూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా పేదలకు మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయని కొప్పాక సొసైటీ అధ్యక్షుడు చల్లగొళ్ల వెంకటేశ్వరరావు అన్నారు. పెదకడిమిలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రోగులను పరీక్షించి, అవసరమైనవారికి ఉచితంగా మందులు అందించారు. వైద్యులు మాధవి, కులకర్ణి, భాగ్యశ్రీ, ప్రత్యూష, గౌతమ్ వైద్యసేవలు అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొసరాజు బలరామకృష్ణ చౌదరి, ఎంపీటీసీ సీహెచ్.గోపాలకృష్ణ, ఈవోపీఆర్డీ శ్రీనివాస్, ఎంఈవో వి.అరుణ్‌కుమార్, ఆర్‌ఏ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మేలు



దొండపాడులో బాలఅయ్యప్ప స్వామిని దర్శించుకుంటున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆధ్యాత్మిక చింతన, భక్తి భావన మనిషిలోని సద్గుణాలను మేల్కొలపడంతో పాటు సేవాతత్పరత కలుగచేస్తుందని జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అన్నారు. గురువారం ఏలూరు రూరల్ దొండపాడు బాల అయ్యప్ప క్షేత్రంలో అయ్యప్ప స్వామి మండల దీక్ష స్వాములకు ద్వాదశి 12వ వార్షిక భిక్ష కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ప్రారంభించారు. అయ్యప్ప మాలలో ఉన్న ఆయన అయ్యప్ప స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు కె.అనంతాచార్యులు కలెక్టర్‌కు వేద ఆశీర్వచనం పలికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అయ్యప్ప మండల దీక్ష స్వాములకు భిక్షను వడ్డించి, స్వాములతో కలిసి భిక్ష స్వీకరించారు. తొలుత కలెక్టర్‌కు దేవస్థానం పాలకమండలి సభ్యులు, పురోహితులు, అయ్యప్ప దీక్షాధారులు పూర్ణకుంభంతో, మంగళ వాయిద్యాలతో స్వాగతం పలికారు. తొలుత బాల అయ్యప్పస్వామి వారికి పంచామృత అభిషేకం నిర్వహించి విశేష అలంకరణ చేశారు. లక్ష్మీ గణపతి హోమం, అయ్యప్ప తారక మంత్ర హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఎర్రం శెట్టి సుమన్, ఆలయ వ్యవస్థాపకులు గుమ్మడిదల సీతారామయ్య గురుస్వామి, కార్యదర్శి బొల్లా వీరవెంకట సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు గుమ్మడిదల కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రయోజనాత్మకంగా పీఎంశ్రీ వర్క్‌షాప్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాల పెంపు తదితర అంశాలకు ప్రాధాన్యత కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం అమలు చేసే పీఎంశ్రీ పథకానికి సంబంధిచి అవగాహన కలిగించడానికి ఇటీవల న్యూ ఢిల్లీలో నిర్వహించిన పీఎంశ్రీ వర్క్‌షాప్ ప్రయోజనాత్మకంగా ఉందని డెమోక్రటిక్ పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వెంకటేశ్వరరావు తెలిపారు. గత నెల 26 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఏలూరు జిల్లా నుంచి ఏకైక ప్రధానోపాధ్యాయునిగా ఎంపికై పాల్గొన్న వెంకటేశ్వరరావు గురువారం డీఈఓ పి.శ్యామ్ సుందర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. వర్క్‌షాప్‌లో చర్చించిన అంశాలను డీఈఓకు వివరించారు. డిజిటల్ విద్యను అందించాలనే లక్ష్యంతోనే పీఎంశ్రీ పథకం అమలు చేస్తున్నట్టు తెలిపారని చెప్పారు. ఎన్‌సీఈఆర్‌టీ ద్వారా పీఎంశ్రీ అమలు చేసి అందరికీ సమాన విద్యావకాశాలు కల్పించాలన్నదే కేంద్ర ప్రభుత్వ ఆశయమన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



భీమడోలులో విగ్రహాలకు జలాభిషేక పూజలు చేస్తున్న భక్తులు, అర్చకులు

భీమడోలు: భీమడోలులో నూతనంగా నిర్మించిన శ్రీకోదండ రామాలయం, నూతన విగ్రహాల ప్రతిష్ఠాపనా మహోత్సవాలు రెండో రోజు గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సహస్ర కలశాభిషేకం ఆకట్టుకుంది. కలశాల బిందెలతో గ్రామ పుర వీధుల్లో ప్రదర్శన చేశారు. అనంతరం శ్రీరామ జపం చేశారు. గ్రామంలోని వందలాది మంది భక్తులు పాల్గొని హోమ ఘట్ట పూజలను తిలకరించారు. తొలుత విగ్రహాలకు జలాభిషేకం చేశారు. శనివారం నూతన ఆలయం, విగ్రహాలను ప్రతిష్ఠిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

ఎమ్మెల్యే పరామర్శ

దెందులూరు: శ్రీరామవరం గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న కమ్మ రాంబాబు భార్య లక్ష్మీజ్యోతిని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి గురువారం పరామర్శించారు. ఆమె ఆరోగ్య స్థితిగతులను తెలుసుకొని మెరుగైన వైద్యసేవలు పొంది త్వరితగతిన కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు అక్కినేని శ్రీనివాసరావు, పార్టీ నాయకులు కామిరెడ్డి బాలు, ప్రతాప్ ఉన్నారు.

పామాయిల్ కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలి



కొఠారు రామచంద్రరావుకు వినతిపత్రం అందిస్తున్న వ్యవసాయ సంఘం నాయకులు

దెందులూరు: పామాయిల్ కార్మికుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పీ.రామకృష్ణ ఏపీ ఆయిల్‌ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావుకు వినతిపత్రం అందచేశారు. గురువారం ఎమ్మెల్యే కార్యాలయంలో ఈ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో పామాయిల్ పంటలు ఎగుమతి, దిగుమతి చేస్తున్న కార్మికులు గెలలు, మట్టలు నరికే కార్మికులు సుమారు 10 వేలకు మందిపైగా ఉన్నారన్నారు. వారి సమస్యలను పరిష్కరించడంలో జిల్లా ఉద్యానశాఖ, కార్మిక శాఖాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాని కోరారు. ప్రమాదంలో చనిపోయిన కార్మికులకు ఇస్తున్న నష్టపరిహారాన్ని రూ.10 లక్షలకు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. పామాయిల్ కార్మికులకు గుర్తింపు కార్డు, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం కొఠారు రామచంద్రరావు మాట్లాడుతూ కార్మికుల సమస్యలను ఎమ్మెల్యే, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానన్నారు. కార్యక్రమంలో అప్పలస్వామి తదితరులున్నారు.

అసమానతలు లేని అభివృద్ధి కోసం ప్రజా రక్షణభేరి



భీమడోలులో నిర్వహించిన సమావేశంలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆర్.లింగరాజు

భీమడోలు: అసమానతలు లేని అభివృద్ధి లక్ష్యంగా నిర్వహిస్తున్న ప్రజా రక్షణ భేరిని విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్.లింగరాజు అన్నారు. భీమడోలులోని పార్టీ కార్యాలయంలో ఉంగుటూరు నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా రక్షణ భేరి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సమావేశానికి జిల్లా నాయకులు కట్టా భాస్కరరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆర్.లింగరాజు మాట్లాడుతూ సీపీఎం ఆధ్వర్యంలో తయారు చేసిన ప్రజా ప్రణాళికను ప్రజల్లోకి తీసుకుని వెళ్లేందుకు ఈనెల 9, 10వ తేదీల్లో నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ప్రచార యాత్రలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 15న విజయవాడలో లక్ష మందితో భారీ బహిరంగ సభను నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో నేతలు ఎస్.రమణారావు, వెజ్జు శ్రీరామచంద్రమూర్తి, కె.శ్రీను, పి.నాగరాజ, కె.అప్పారావు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

చేప పిల్లలను విడిచిపెట్టిన ఎమ్మెల్యే ఎలీజా



ఎ.పోలవరంలో చెరువులో చేప పిల్లలను విడిచి పెడుతున్న ఎమ్మెల్యే ఎలీజా

జంగారెడ్డిగూడెం రూరల్: మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెం మండలంలో పుట్లగట్లగూడెం, చక్రదేవరపల్లి, ఎ.పోలవరం, తాడువాయి, వేగవరం, కేతవరం, అమ్మపాలెం గ్రామాల్లో ఉన్న చెరువులు, రిజర్వాయర్లలో చేప పిల్లలను విడిచి పెట్టారు. 17 యూనిట్లకుగాను 6 లక్షల 80 వేల చేప పిల్లను విడిచి పెట్టారు. ఎ.పోలవరంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎలీజా పాల్గొని చిన్న పెద్దా చెరువులో చేప పిల్లలను విడిచి పెట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎలీజా మాట్లాడుతూ మత్స్యకారుల సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను, సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బుద్దాల సీతారామరాజు, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు, ఎంపీటీసీ పసుపులేటి వరలక్ష్మి, వైస్ ఎంపీపీ నరెడ్ల బుజ్జిబాబు, మత్స్యకారుల సొసైటీ అధ్యక్షుడు బెజవాడ నాగరాజు, సచివాలయాల మండల కన్వీనర్ గురజాల పార్థసారథి, ఎంపీడీవో కె. విజయ్ ప్రసాద్, మత్స్యశాఖ సహాయ సంచాలకులు బి.నర్సయ్య, జంగారెడ్డిగూడెం మత్స్యశాఖ అభివృద్ధి అధికారి కె.మంగారావు తదితరులు పాల్గొన్నారు.

మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించుదాం



సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర నాయకుడు కేశవరావు

ఏలూరు (టూటౌన్): రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తూ రైతాంగాన్ని మోసగించిన కేంద్రంలోని మోదీ ప్రభుత్వాన్ని కార్మిక, కర్షక ఐక్యతతో గద్దె దించుతామని ఏపీ రైతు సంఘాల సమన్వయ కమిటీ కేంద్ర కార్మిక సంఘాల సమన్వయ కమిటీ నాయకులు హెచ్చరించారు. ఈ నెల 27, 28 తేదీల్లో రైతు సంఘాలు, కార్మిక సంఘాలు నిర్వహించే మహాధర్నాను విజయవంతం కోరుతూ ఏపీ రైతు సంఘాల కార్మిక సంఘాల జిల్లా సమన్వయ కమిటీల సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా సన్నాహక సమావేశం స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయంలో గురువారం రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఏపీ రైతు సంఘం సీనియర్ నాయకులు వై.కేశవరావు, కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు జెట్టి గురునాథరావు, ఏపీ కౌలు రైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.జమలయ్య హాజరై మాట్లాడారు. ఢిల్లీ రైతాంగ ఉద్యమం సందర్భంగా మోదీ ప్రభుత్వం ఇచ్చిన హామీలు, మద్దతు ధరల గ్యారెంటీ చట్టం చేయకుండా మోసం చేసిందని ఆరోపించారు. దొడ్డిదారిన మూడు వ్యవసాయ నల్ల చట్టాలను అమలు చేస్తూ రైతుల వ్యవసాయాన్ని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకు కుట్ర చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయకుండా రైతులను వ్యవసాయం నుంచి దూరం చేసే చర్యలు చేపడుతోందని వివరించారు. కేంద్ర విద్యుత్ సవరణ బిల్లు రద్దు చేయాలని, వ్యవసాయ పంపు సెట్లకు మీటర్ల బిగింపు ఆపాలని, ఉత్పత్తి వ్యయానికి 50 శాతం కలిపి మద్దతు ధరలు నిర్ణయించి చట్టబద్ధత కల్పించాల్సిందిగా కోరారు. ఈ సందర్భంగా మహాధర్నా బుక్‌లెట్‌ను విడుదల చేశారు. వివిధ సంఘాల నాయకులు ఆర్ లింగరాజు, డీఎన్‌వీడీ ప్రసాద్, బండి వెంకటేశ్వరరావు, బద్దా వెంకట్రావు, ఎస్‌కే బాషా, తలారి ప్రకాష్, రాయంకుల లక్ష్మణరావు, కె.అప్పారావు, కుంజం రామారావు, కె.పోసమ్మ, సముద్రాల సుందరరావు తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు దూరంగా ఉండండి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని త్రీటౌన్ సీఐ కె.శివాజీ సూచించారు. స్థానిక సీఆర్‌ఆర్ మహిళా కళాశాలలో గురువారం యాంటీ ర్యాగింగ్ సెల్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దొంగతనాలు, ర్యాగింగ్ పట్ల అప్రమత్తంగా ఉండాలని, సీనియర్స్‌కు జూనియర్స్‌కు సత్సంబంధాలు ఉండాలని అన్నారు. వివిధ నేరాలకు సంబంధించి ఐపీసీ సెక్షన్ల ద్వారా తీసుకునే చర్యలను వివరించారు. ఎన్‌సీఈఆర్‌టీ, ఎస్‌సీఈఆర్‌టీని విద్యార్థుల సిలబస్‌లో చేర్చడం ద్వారా వారికి ఒకరితో ఒకరు ఎలా ప్రవర్తించాలో తెలుస్తుందన్నారు. ప్రతి కళాశాలలోనూ ప్రిన్సిపాల్ చైర్మన్‌గా ఒక కమిటీని నియమించి విద్యార్థుల సమస్యలు తెలుసుకోవాలని, విద్యార్థులకు క్రీడలపై ఆసక్తి కలిగేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి.శైలజ, యాంటీ ర్యాగింగ్ సెల్ ప్రతినిధులు పాల్గొన్నారు.